సాక్షి
వికారాబాద్

ఆదివారం । 11 । జూన్ । 2023



ప్రతి హామీని నెరవేరుస్తాం

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం పయనిస్తుందని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. 8లో▸



సర్వేయర్ రారు..

పెద్దేముల్ మండలంలో సర్వేయర్ సమస్య వేధిస్తోంది. సక్రమంగా రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



పల్లెల్లో ప్రగతి పరుగులు

కొత్త జీపీలు ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని సర్పంచుల సంఘం అధ్యక్షుడు అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి

దోమ: వీధి నాటకాల కళాకారులను ప్రోత్సహించాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనాపూర్‌లో జరుగుతున్న కురుక్షేత్రం వీధి నాటకానికి ఆయన హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న వీధి నాటకాలను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వీధి నాటకాలను వీక్షిస్తూ వాటిలో ఉన్న సారంశాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం కళాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.

'బీసీలందరికీ ఆర్థిక సాయం చేయాలి'

కొడంగల్: రాష్ట్రంలో ఉన్న బీసీలందరికీ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్ చేశారు. బీసీ జాబితాలో ఉన్న ప్రతి ఇంటికీ రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు. నిరుద్యోగులకు, పేదలకు ఐదు లక్షలు ఇస్తే వారు స్వయం ఉపాధి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీలకు నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన తరగతులకు బీసీ బంధు ప్రకటించాలన్నారు. ప్రస్తుతం కొంతమంది చేతి కులవృత్తుల వారికి ఇస్తున్న లక్ష రూపాయల సాయం సరిపోదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జంగయ్య మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయ ఖాళీలను సత్వరం భర్తీ చేయాలని కోరారు. మన ఊరు మనబడి కార్యక్రమాన్ని అన్ని పాఠశాలలకు విస్తరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను తగ్గించడానికి ఉపాధ్యాయులకు పదోన్నతి ఇవ్వాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు బేసిక్ పే వర్తింపజేయాలని కోరారు. ఈనెల 20న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల మనుగడ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, డీఈఓ, ఎంఈఓ, డిప్యూటీ ఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటప్ప, ఉపాధ్యక్షులు రాములయ్య, ఎస్.కల్పన, కోశాధికారి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొడంగల్ రూరల్: ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2–30గంటల నుంచి 5–30గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, విద్యార్థులు సమయపాలన పాటిస్తూ పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

రోడ్డెక్కిన రైతన్న

ధాన్యం కొనుగోలు చేయాలంటూ నిరసన

- రోడ్డుపై ట్రాక్టర్లు నిలిపి బైఠాయింపు
- వర్షాలు కురుస్తున్నా ఎవరికీ పట్టడంలేదని ఆవేదన



గోకఫసల్‌వాడ్ వద్ద రోడ్డుపై ట్రాక్టర్లను అడ్డంగా నిలిపి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దౌల్తాబాద్: ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు రోడ్డెక్కారు. శనివారం గోకఫసల్‌వాడ్ రైస్ మిల్లు వద్ద రోడ్డుపై ట్రాక్టర్లను అడ్డంగా నిలిపి ధర్నా చేపట్టారు. పది రోజులుగా కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఓ వైపు వర్షాలు పడుతున్నాయని ధాన్యం తడిచిపోతున్నదని వాపోయారు. రైస్‌మిల్లుల యజమానులు తమ టార్గెట్ అయిపోయిందని కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారని అన్నారు. కేంద్రాల వద్దకు వెళ్తే లారీలు రావడంలేదని మిల్లుల వద్దకు వెళ్లాలని నిర్వాహకులు చెబుతున్నారని.. ఇలా తమ జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించారు. చివరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పుస్తకాలొచ్చాయ్..

జిల్లాకు చేరిన 5,74,010 పాఠ్యపుస్తకాలు

- పాఠశాలలకు తరలించేందుకు చర్యలు
- పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీ



దోమ ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలు

దోమ: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,28,452 పుస్తకాలు మంజూరు కాగా, అందులో 5,74,010 పుస్తకాలు జిల్లా కార్యాలయానికి మొదటి విడతగా చేరుకున్నాయి. మండల కార్యాలయాలకు 4,89,713 పుస్తకాలను 85 శాతం పంపిణీ చేశారు. మలి విడత కింద జిల్లా కార్యాలయానికి 21, 560 పుస్తకాలు రావాల్సి ఉంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పాఠశాలల బలోపేతం దిశగా ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి నిన్నటితో పూర్తి చేసింది.

పాఠశాలల వారీగా పంపిణీ

దోమ మండల వ్యాప్తంగా 70 పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో సుమారు ఆరు వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ పుస్తకాలను అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లా కార్యాలయాల నుంచి మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి పార్టు–1 కింద 80 శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇప్పటికే పాఠశాలల వారీగా పలు పాఠశాలలకు పంపిణీ చేయగా, మిగత పాఠశాలలకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు విడతలుగా..

విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలను రెండు విడతలుగా విభజించారు. పార్టు–1 పుస్తకాలు ముందస్తుగా పంపి, పార్టు–2 కింద కాస్త ఆలస్యంగా పంపనున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో ముందస్తుగా పార్టు–1 కింద వచ్చిన పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభమైంది. ఎమ్మార్సీ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పార్టు–2 కూడా త్వరతో వస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందించేందుకు కృషి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

> **పంపిణీ ప్రారంభించాం**
>
> మొదటి విడతగా పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్నాయి. రెండో విడతలో మరిన్ని పుస్తకాలు వస్తాయి. వచ్చిన వాటిని ఇప్పటికే పలు పాఠశాలలకు పంపిణీ చేశాం. మిగతా పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే సరఫరా చేస్తున్నాం. ఏకరూప దుస్తులు కూడా త్వరలో రానున్నాయి. వాటిని సైతం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.
>
> – హరిశ్చందర్, ఎంఈఓ, దోమ

గ్రూప్–1కు సర్వం సిద్ధం

- నేడే ప్రిలిమినరీ పరీక్ష
- పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతగిరి: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్ 1 పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు గ్రూప్ 1 పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 4,857 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. వారికోసం 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు ఉదయం 10:15 గంటలలోపు పరీక్ష కేంద్రాల్లో ఉండాలన్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరాదని ఆదేశించారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు త్వరగా కేంద్రంలోకి పంపించేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రానికి అనుసంధాన అధికారి, చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగిలిన సిబ్బంది, అభ్యర్థులు గాని ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సెల్ ఫోన్లను తీసుకురాకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, మెడికల్ టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క చిన్న సమస్య రాకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎగ్జామ్స్ సూపరింటెండెంట్లు, అనుసంధాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్

గ్రూప్ –1 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఏవేని సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ నంబర్ 79950 61192కు ఫోన్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

100కు డయల్ చేయండి

అభ్యర్థులకు ఎలాంటి సమస్య ఉన్నా 100కు డయల్ చేయాలని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మొత్తం 86 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎస్పీ ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి

షాబాద్: ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని దామర్లపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన మేడి బలవంత్‌రెడ్డి కూతురు అక్షయ, కమ్మరి శ్రీనివాస్‌పై శునకాలు దాడి చేసి గాయపరిచాయి. గాయపడ్డవారిని చందనవెళ్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి అక్కడి నుంచి నగరంలోని కోరంటి ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

షాద్‌నగర్: ఆడుకుంటున్న బాలుడిని ట్రాక్టర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొండారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ధనుంజయ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వట్టెల బాలమణి, మల్లేశ్ దంపతుల కుమారుడు విష్ణు (2) శనివారం ఉదయం ఇంటి పక్కన ఉన్న రోడ్డుపై ఆడుకుంటున్నాడు. అదే సమయంలో తిమ్మగళ్ల మత్తు అనే వ్యక్తి ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిస్తూ బాలుడిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ బాలుడి తల పై నుండి వెళ్లడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి చిన్నాన్న నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోక్‌అదాలత్‌లతో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్
- జిల్లాలో 2,386 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అనంతగిరి: లోక్ అదాలత్‌లలో రాజీపడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. ఈ మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా వికారాబాద్‌లోని కోర్టుల పరిధిలో 1,030, పరిగిలో 46, తాండూరులో 1,135, కొడంగల్‌లో 175 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం ఏర్పడుతుందని, కేసు నుంచి విముక్తి కలుగుతుందన్నారు. రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకటవ అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, రిటైర్డు సీనియర్ జడ్జి శాంతరాజ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చీఫ్ డిఫెన్స్ లీగలేయర్ కౌన్సిల్ వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఎడ్ కౌన్సిల్ రాము, పీపీలు నారాయణగౌడ్, అశోక్‌కుమార్, అన్వేష్‌సింగ్, సమీనాబేగం, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ ఇంగ్లిష్ నేర్పండి



ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రామేశ్వర్ గౌడ్

- లాంగ్వేజ్ శిక్షకుడు రామేశ్వర్ గౌడ్
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ

వికారాబాద్ అర్బన్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడం రావాలన్న ప్రధాన లక్ష్యంతో ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని లాంగ్వేజ్ శిక్షకుడు ఏ.రామేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఒక రోజు ఆంగ్లంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. గ్రామర్‌తో పాటు, పాఠశాల స్థాయి పిల్లలకు తేలిగ్గా అర్థమయ్యేలా ఎలా బోధించాలనే దానిపై సుమారు రెండు గంటల పాటు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు తెలుగు మాట్లాడినట్లే ఇంగ్లిష్ మాట్లాడాలనే లక్ష్యంతో విల్ టూ కెన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు రామేశ్వర్ గౌడ్ తన ప్రయత్నాన్ని, అనుభవాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. 2007 నుంచి ఇంగ్లిష్ గ్రామర్ బోధిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల పాటు ఆన్‌లైన్ క్లాసులు ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఫిజికల్‌గా ఈ రోజు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు, సెలబ్రిటీలకు కూడా ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 2016లో రియల్ లైఫ్ ఇంగ్లిష్ పుస్తకాన్ని రవీంద్ర భారతిలో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ అవకాశం ఇవ్వడంతో ఇప్పటి వరకు మొదటి విడతలో ఐదు జిల్లాలు పూర్తయ్యాయని, రెండో విడతలో భాగంగా వికారాబాద్, రంగారెడ్డి, యాదాద్రి, మంచిర్యాల జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కూర్చునేందుకు స్థలం లేక..

ఇంగ్లిష్ గ్రామర్ క్లాసును వినడానికి జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ప్రభుత్వ డైట్ కళాశాలలోని హాలులో కేవలం 150 నుంచి 200 మంది వరకే కూర్చునే అవకాశం ఉంది. సుమారు 500మంది ఉపాధ్యాయులు వచ్చారు. కూర్చోడానికి స్థలం లేక పోవడంతో 300 మంది వరకు తిరిగి వెళ్లారు. కొందరు చెట్ల కింద కూర్చొని క్లాసు విన్నారు. కొందరు మహిళా ఉపాధ్యాయులు నేలపై కూర్చొని వినాల్సి వచ్చింది. పలుమార్లు మైక్ కూడా పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. ఇంత మంచి శిక్షణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపించాయి.

ప్రజలకు మరింత మేలు చేద్దాం

- సమన్వయంతో పనిచేస్తేనే సుపరిపాలన
- సంక్షేమ ఫలాలు సకల జనులకు చేరాలి
- కలెక్టర్ నారాయణ రెడ్డి
- ఘనంగా సుపరిపాలన దినోత్సవం





సుపరిపాలన దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

వికారాబాద్ అర్బన్: పరిపాలనలో వచ్చిన మార్పులతో ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరేలా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయడంతో మంచి సుపరిపాలన అందుతుందని తెలిపారు. ఆయా శాఖల్లో స్పష్టమైన మార్పుతో అధికారులు ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం పరిపాలన పరంగా ఎన్నో మార్పులు తీసుకురావడంతో పాలన ప్రజల చెంతకే వచ్చిందని తెలిపారు. కొత్త జిల్లాలు, మండలాలు, కొత్త జీపీలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత వికారాబాద్ జిల్లా ఏర్పడటంతో పాటు రెండు రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేసుకోవడం, రెండు మున్సిపాల్టీలను నాలుగు ఏర్పాటు చేసుకోవడంతో పాలన మరింత క్షేత్ర స్థాయికి చేరుకుందన్నారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా కొత్తగా మరో మూడు మండలాలు ఏర్పాటు చేయడంతో పాలన గ్రామాలకు చేరిందన్నారు. పాలన మరింత చేరువగా ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో 216 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. రెవెన్యూలో ధరణి లాంటి మార్పులు తీసుకరావడంతో భూముల సమస్య తీరిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమం ఎంతో ప్రగతిని సాధించిందన్నారు.

జవాబుదారీ తనం

బీసీ కమిషన్ సభ్యుడు ఎస్. శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రభుత్వం జవాబుదారి తనంతో పనిచేస్తోందన్నారు. 1978లో ఏర్పడిన రంగారెడ్డి జిల్లాకు వికారాబాద్ కేంద్రం కావాలని కొట్లాడినా, పది వేల ఉత్తరాలు రాసినా కల సాకారం కాలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత కేసీఆర్ నిర్ణయంతో ప్రత్యేక జిల్లా కల నెరవేరిందన్నారు. 2010లో కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల చొరవతో జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందని రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో అధికారులు పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల్ కుమార్ గౌడ్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ అంజనేయులు, నీటి పారుదల శాఖ ఎస్పీ హెప్సీనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మూడు రోజులుగా సరఫరా నిల్!



వల్లభ్‌నగర్‌లో నేలకొరిగిన విద్యుత్‌స్తంభం

పరిగి: మూడు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పట్టణంలోని వల్లభ్‌నగరలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో 72 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. ఆ ప్రాంతం చీకట్లో మగ్గుతోంది. స్తంభాలు విరిగి కరెంటు పోయిందని విద్యుత్ అధికారులకు చెప్పినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేసి కరెంట్ కష్టాలు తీర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

'పీపుల్స్‌మార్చ్' విజయవంతం కావాలని పూజలు

మీర్‌పేట: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర విజయవంతం కావాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం మీర్‌పేట జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరిగి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకే భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. పాదయాత్ర ఇప్పటికే వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుందని, తరువాత యాత్ర కూడా విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. క్యార్యక్రమంలో స్థానిక నాయకులు సిద్దాల శ్రీశైలం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మాధవాచారి, అరుణ, పద్మశ్రీ, గంగమ్మ, ఆల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులో శనివారం వెలుగు చూసింది. సుమారు 40 ఏళ్ల వయసు గల వ్యక్తి సంతాపూర్ గ్రామ శివారులో ఉన్న మౌలాలి వ్యవసాయ పొలంలో చెట్టుకు చున్నీతో ఉరి వేసుకున్నాడు. మధ్యాహ్నం గొర్రెల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వీఆర్‌ఓ కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ఐదురోజుల క్రితమే చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కుళ్లిపోయిన శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎరుపు రంగుపై తెలుపు, నలుపు గీతలు ఉన్న షర్టును ధరించినట్లు, కుడి చేతికి ఎరుపు రంగం దారం కట్టుకొని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- త్వరలో సాగుకు పాలమూరు ఎత్తిపోతల జలాలు
- పల్లెబాటలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి



మరికల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పయనిస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. పల్లెబాటలో భాగంగా శనివారం చౌడాపూర్ మండలం చిన్నమెగ్యాతండా, కిష్టంపల్లి, మరికల్, కల్మాన్‌కల్వ, బంగరంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. త్వరలోనే కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలకు పాలమూరు ఎత్తిపోతల నుంచి సాగునీరు అందనుందని చెప్పారు. నవాపేట్ మండలం ఉద్దండపూర్ రిజర్వాయర్ నుంచి చౌడాపూర్, కుల్కచర్ల, పరిగి, వికారాబాద్ నుంచి తాండూర్ వరకు సాగు నీరు అందించేందుకు కాల్వలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

మిగతా పింఛన్ దారులకు పెంచుతాం!

దివ్యాంగులకు రూ.వెయ్యి అదనంగా పింఛన్ పెంచామని, మిగతా పింఛన్ దారులకు పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. త్వరలోనే ఏకకాల రుణమాఫీ చేసి రైతుల ఇబ్బందులు తొలగించనున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల ప్రధానకార్యదర్శి నర్సింహులు, యువజన విభాగం అధ్యక్షుడు మెగ్యానాయక్, మండల కో ఆప్షన్ సభ్యుడు జుబేర్, నాయకులు మఠం రాజశేఖర్, చెన్నయ్య, మొగులపల్లి రవి, అశోక్, సర్పంచులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా తీర్చిదిద్దుతున్నాం..

అనంతగిరి: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణా శిబిరం ఏర్పాటు చేశామని తెలంగాణ లగోరి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ అన్నారు. ధన్నారం యజ్ఞ స్కూల్‌లో లగోరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ముంబయి, జమ్ము కాశ్మీర్‌లో జరిగే జూనియర్, సీనియర్ జాతీయ పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేస్తున్నామన్నారు. గెలుపే ధ్యేయంగా వారిని తీర్చిదిద్దుతున్నామని, జాతీయ స్థాయిలో తప్పకుండా రాణిస్తామని క్రీడాకారులు ధీమా వ్యక్తంచేస్తున్నారని వెల్లడించారు.



శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న లగోరి ప్రతినిధులు

పంతాలతో పగలు పెంచుకోవద్దు



పరిగి: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జనార్దన్



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు

పరిగి: రాజీయే రాజమార్గమని రిటైర్డ్ ఇన్‌చార్జి జడ్జి జనార్దన్ అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 43 కేసుల్లో ఇరువురు కక్షిదారులను రాజీ చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడారు. పంతాలకు పోయి పగలు, ప్రతీకారాలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు పలు కేసులకు దారితీస్తాయని, కావున ఎలాంటి కేసులైనా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. ఇరువురి రాజీతో కేసుల సమస్య తక్షణమే పరిష్కారమవుతుందని, లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులను అంతిమ పరిష్కారంగా పరిగణిస్తారని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ దీపారాణి, ఏజీపీ వెంకట్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాచంద్రయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా..

కొడంగల్ రూరల్ : రాజీమార్గమే రాజమార్గమని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి బి.శ్రీరామ్ సూచించారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో కక్షిదారులనుద్దేశించి మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కోర్టులో చాలా సమయం పడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి మంచి అవకాశమని అన్నారు. కేసుల రాజీతో డబ్బు, సమయం ఆదా అవుతుందని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో 175 కేసులను పరిష్కరించారు. కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్ మెంబర్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: తాండూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో జడ్జి శివలీల పలు కేసులను పరిష్కరించారు. మొత్తం తాండూరు సబ్ డివిజన్ పరిధిలో వచ్చిన కేసుల్లో లోక్ అదాలత్ బెంచ్‌లో 1,135 కేసులకు రాజీ కుదిర్చి శాశ్వత పరిష్కారం చూపారు. మార్నింగ్ సెషన్‌లో 998 కేసులు, మధ్యాహ్నం సెషన్‌లో సీసీ లోక్ అదాలత్ ఐపీసీ కేసులు 60, సీసీ ఎక్సైజ్ తాండూరు 11, సీసీ ఎక్సైజ్ పీఎస్ పరిధిలో 18, ఓఎస్ సివిల్ కేసులు 5, భరణం కేసులు 3, డీవీసీ 1, సీసీ అడ్మిషన్ 22, ఎస్‌టీసీ అడ్మిషన్ 1, ఎన్‌ఐ యాక్ట్ 3, క్రైమ్ స్టేజ్ కేసులు 5, పీఎల్‌సీ బ్యాంక్ కేసులు 8 చొప్పున పరిష్కరించారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అశోక్, పీపీ అన్వేష్ సింగ్, లోక్ అదాలత్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సీనియర్ న్యాయవాదులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, భవనప్ప, మనోహర్‌రావు పాల్గొన్నారు.

సర్వేయర్ రారు.. సమస్య తీర్చరు

- నెల రోజులుగా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సర్వేయర్ కోసం భూ పత్రాలతో రైతులు

పెద్దేముల్: మండలంలో సర్వేయర్ సమస్య పట్టిపీడిస్తోంది. ఉన్న సర్వేయర్ నెలకోసారి తహసీల్ కార్యాలయానికి రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ భూముల సర్వేపై చూపిస్తున్న శ్రద్ధ.. తమపై చూపడం లేదని గాజీపూర్, పెద్దేముల్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు శనివారం తహసీల్దార్ ఎదుట వాపోయారు. భూ సర్వే కోసం నెల రోజులుగా తిరుగుతున్నా తమగోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆరు నెలలుగా సాగుకు విరామం..

పెద్దేముల్ మండల బుద్దారం శివారు సర్వే నంబర్ 110లో సుమారు 20 ఎకరాల సాగు భూమిలో.. మంతటి బస్సప్ప, నారాయణ, అన్నసారం రాములు, మాండమ్మ, నర్సింహులు, కడగంటి శ్రీను, బుద్దారం వెంకటయ్య, మంగటి మణెమ్మలు ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. వారి పొలాల పక్కన మరో రైతు భూమి తక్కువ ఉందని చెప్పడంతో.. అన్నదాతలు ఆరు నెలలుగా సాగు పనులు ఆపి, సర్వేయర్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ స్పందించక పోవడంతో ఈ నెల 9న గాజీపూర్ గ్రామానికి చెందిన రైతులు బస్సయ్య, చంద్రప్ప, మల్లేశం, శ్రీను, రవిందర్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని కలిసి తమగోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సర్వేయర్‌తో మాట్లాడారు. వెంటనే సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు సర్వేయర్ రాకకోసం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. అయినా రాకపోవడంతో నిరుత్సాహం వ్యక్తం చేశారు. సర్వేయర్ రాడు.. మా సమస్య తీర్చడని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి మరో సర్వేయర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

వార్డు ఆఫీసులతో సుపరిపాలన

- వికేంద్రీకరణతోనే సమస్యల పరిష్కారం
- వార్డు అధికారులపై ఎంతో బాధ్యత ఉంది
- కుక్కకాటు మరణాలతో గుండె కలుక్కుమంటోంది
- మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో/మాదాపూర్: పరిపాలన సౌలభ్యం, సుపరిపాలన కోసమే వార్డు ఆఫీసులను నెలకొల్పుతున్నట్లు మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం హైటెక్స్‌లో జరిగిన సుపరిపాలన దినోత్సవంలో భాగంగా వార్డు ఆఫీస్ అవగాహన శిక్షణలో ఆయన ప్రసంగించారు. పరిపాలన వికేంద్రీకరణతోనే సమస్యల పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణలో స్వపరిపాలన వచ్చిందని, సుపరిపాలన కూడా రావాలనేదే లక్ష్యమన్నారు. ఇందుకోసమే వేగవంతంగా పరిపాలన సంస్కరణలను చేపట్టినట్లు తెలిపారు. జనమే కేంద్ర బిందువుగా, సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా పని చేస్తే ఏ ప్రభుత్వమైనా ప్రశంసలు పొందుతుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత ఉన్నతమైన సేవలు అందించేందుకు వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో రోజువారీగా 8000 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోందని, సెప్టెంబర్ నాటికి పూర్తి స్థాయిలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చేస్తున్న నగరంగా హైదరాబాద్ నిలువబోతోందని చెప్పారు.

ఎంతో అవమానకరం..

కుక్కకాట్లతో బాలుడు మృతి చెందిన దృశ్యాలు చూస్తే ఎవరికైనా గుండె కలుక్కుమంటుందంటూ మంత్రి కేటీఆర్ తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. కుక్కకాట్లతో మరణాలు అవమానకరమన్నారు. కుక్కలకు తెలియదు కేటీఆర్ కొడుకా.. మంత్రి కొడుకా.. అధికారి కొడుకా అని. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. అంతరిక్షంలోకి రాకెట్లు పంపడమే కాదు. వీధికుక్కలు, దోమల సంగతి కూడా మనమే చూడాలన్నారు. ప్రజలు అద్భుతాలు ఆశించడం లేదని, కనీస సదుపాయాలే కోరుతున్నారన్నారు. ప్రతి శనివారం రీథింక్ కార్యక్రమం కింద పనికిరాని వ్యర్థాలు సేకరిద్దామని వెల్లడించారు.

ప్రతీ మురుగు నీటిచుక్క శుద్ధి..

ఆగస్టు చివరి నాటికి నగరంలో ఉత్పన్నమయ్యే ప్రతీ మురుగునీటి చుక్కను శుద్ధి చేయబోతున్నామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్ అవతరిస్తుందని పునరుద్ఘాటించారు. జలమండలి ఆధ్వర్యంలో రూ.3866 కోట్లతో కొత్తగా 31 ఎస్టీపీలు నిర్మిస్తున్నామని.. ఇవి అందుబాటులోకి వస్తే మురుగు శుద్ధి సామర్థ్యం 2 వేల ఎంఎల్డీలకు చేరుతుందన్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 9 శాతం మాత్రమే మురుగు శుద్ధి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పురపాలక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, సీడీఎంఏ కమిషనర్, డైరెక్టర్ సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేష్ కుమార్, జలమండలి ఎండీ దానకిశోర్, ఈడీ డా.ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, శ్రీధర్ బాబు, వీఎల్ ప్రవీణ్ కుమార్, సీజీఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

షాద్‌నగర్: రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం కేశంపేట మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. ఆమనగల్లుకు చెందిన కోటయ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో శనివారం మధ్యాహ్నం కేశంపేట శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని స్వగ్రామానికి వెళుతున్నాడు. ఆ సమయంలో ఇబ్రహీంపట్నం మండలం చెర్లపటేల్‌గూడకు చెందిన జంగయ్య కేశంపేట నుంచి నూర్‌ఫంక్షన్ హాల్ వైపు బైక్‌పై వస్తున్నాడు. పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రోడ్డుపై రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలపై వెళుతున్న కోటయ్య, జంగయ్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వీరిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాసబ్ చెరువు పరిరక్షణకు సహకారం



ప్రవీణ్‌కుమార్‌తో మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తుర్కయంజాల్: మాసబ్ చెరువును భూ కబ్జాదారుల నుంచి రక్షించాలని ఆ ప్రాంత ప్రజలు చేస్తున్న పోరాటం అభినందనీయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు శనివారం ఆయన నివాసంలో కలిసి చెరువును కాపాడటానికి సహకారం అందించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. చెరువు పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి బీఎస్పీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షులు రమేష్, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వి.బాబు, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు టి.నర్సింహగౌడ్, సభ్యులు యాదిరెడ్డి, కె.అరుణ్ కుమార్, మహేందర్ రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధికోసమే 111 జీఓ ఎత్తివేత

జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి

చేవెళ్ల: ఎన్నికల లబ్ధికోసమే జీఓ 111 ఎత్తేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం నాయకుడు ఎస్.వసంతం విమర్శించారు. మండలంలోని ముడిమ్యాలలో శనివారం కిసాన్ సెల్ ఆధ్వర్యంలో రైతులతో మాటామంతి నిర్వహించారు. జీఓ తొలగింపుతో లాభాలు, నష్టాలపై పర్యావరణవేత్త నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి తదితరులు రైతులు, పార్టీ నాయకులతో సుదీర్ఘంగా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జీఓ 111 ఎత్తివేస్తామని బూటకపు వాగ్దానాలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలోనే జీఓ గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. మోసం చేయాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పడాల రాములు, రైతులు సుదర్శన్, ఖాజామియా, బీరప్ప, నర్సింలు, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివారుకు సిటీ బస్సు

ఆర్టీసీ సర్వీసుల రూట్ పొడిగింపు

- నేరుగా లాస్ట్‌మైల్ కనెక్టివిటీ
- క్యాబ్‌లు, ఆటోల పోటీని తట్టుకునేలా.. ఔటర్ వరకు అందుబాటులోకి..



సాక్షి, సిటీబ్యూరో: గండిమైసమ్మ నుంచి హైటెక్ సిటీకి వెళ్లేందుకు మియాపూర్ వరకు వచ్చి అక్కడి నుంచి మరో బస్సు మారాలి. ఈసీఐఎల్ నుంచి షామీర్‌పేట్‌కు వెళ్లే ప్రయాణికులు సుచిత్ర వద్ద మరో బస్సెక్కాలి. ప్రతి రోజు వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రూట్‌లలో రెండు బస్సులు మారాల్సి రావడంతో ప్రయాణికులు సిటీ బస్సులకు ప్రత్యామ్నాయంగా ఆటోలను ఎంపిక చేసుకుంటున్నారు. ఒక్క ఈ రెండు మార్గాల్లోనే కాదు.. నగరంలోని అనేక రూట్‌లలో నేరుగా బస్సు సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆర్టీసీ అధ్యయనంలో వెల్లడైంది. ఈ క్రమంలో ప్రయాణికుల డిమాండ్, రద్దీ ఉన్న రూట్‌లలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా ఆర్టీసీ అధికారులు కసరత్తు చేపట్టారు. ఇప్పటికే కొన్ని రూట్‌లను పొడిగించి ఈ తరహా బస్సులను అందుబాటులోకి తెచ్చారు. తాజాగా మరిన్ని రూట్లపైన దృష్టి సారించారు. ముఖ్యంగా ఐటీ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, హౌస్‌కీపింగ్ సిబ్బంది, ఔటర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నగరంలోకి రాకపోకలు సాగించే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూట్‌ల పొడిగింపును చేపట్టినట్లు ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు.

సాఫీగా ప్రయాణం..

- జగద్గిరిగుట్ట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి రోజు వందలాది మంది హౌస్‌కీపింగ్ సిబ్బంది ఐటీ సంస్థల్లో పని చేసేందుకు హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ వైపు ప్రయాణం చేస్తారు. కానీ ఈ ప్రయాణికులంతా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు వద్ద బస్సులు మారాల్సి ఉంటుంది. ఇందుకోసం రోడ్డు దాటాలి. ఇది చాలా మంది మహిళా ప్రయాణికులకు ఎంతో ఇబ్బందిగా ఉన్నట్లు ఆర్టీసీ గుర్తించింది. దీంతో జగద్గిరిగుట్ట నుంచి నేరుగా ఐటీ కారిడార్‌లకు చేరుకొనేలా బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టారు.
- ఈసీఐఎల్ నుంచి మేడ్చల్, షామీర్‌పేట్‌లకు వెళ్లేందుకు గతంలో రెండు బస్సులు మారాల్సి ఉంది. దీంతో ఈసీఐఎల్ నుంచి రెండు వైపులా నేరుగా వెళ్లేందుకు బస్సులను అందుబాటులోకి తెచ్చారు. ఉప్పల్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే బస్సులు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మెహిదీపట్నం చౌరస్తాలో మలుపు తిప్పుకోవడం ఎంతో కష్టంగా మారింది. మరోవైపు మెహిదీపట్నం నుంచి మంచిరేవుల వైపు వెళ్లేవారు రెండు బస్సులు మారాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉప్పల్-మెహిదీపట్నం (113ఎం) బస్సులను కొన్నింటిని మంచిరేవుల వరకు పొడిగించారు. ఈ బస్సులు బోడుప్పల్ కాలనీ నుంచి మంచిరేవుల (113/120ఎం) వరకు నేరుగా రాకపోకలు సాగిస్తాయి. బోడుప్పల్ నుంచి నేరుగా నానల్‌నగర్, షేక్‌పేట్, పుప్పాలగూడ, మంచిరేవుల వరకు వెళ్లే ప్రయాణికులు ఈ బస్సులను వినియోగించుకోవచ్చు.
- లింగంపల్లి నుంచి నల్లగండ్ల మీదుగా క్యాసిటీ వరకు మరో కొత్త రూట్‌ను సైతం ఎంపిక చేశారు. మేడ్చల్ వైపు నుంచి ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు మెహిదీపట్నం వరకు ప్రయాణం చేస్తున్నారు. కానీ.. సికింద్రాబాద్‌లో దిగి మెహిదీపట్నం బస్సెక్కాల్సి ఉంటుంది. పద్మవ్యూహాన్ని తలపించే సికింద్రాబాద్ ట్రాఫిక్ వలయాన్ని దాటుకొని బస్సెక్కేందుకు ప్రయాణికులు చాలా కష్టపడాల్సివస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు మేడ్చల్ నుంచి బేగంపేట్ మీదుగా మెహిదీపట్నానికి డైరెక్ట్ బస్సును ప్రవేశపెట్టారు.

ఔటర్‌కు అందుబాటులో..

- శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వరకు ఇటు ఘట్కేసర్ నుంచి మేడ్చల్ వరకు ఔటర్‌కు ఆనుకొని ఉన్న కాలనీలను, గ్రామీణ ప్రాంతాలను కనెక్ట్ చేసేవిధంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- సర్వీస్‌రోడ్డు మార్గాల్లో సిటీ బస్సులను అనుసంధానం చేయడం వల్ల ప్రయాణికులకు నిరాటంకమైన రవాణా సదుపాయం లభించనుంది. 'ఉబెర్. ఓలా వంటి సదుపాయాల వల్ల చాలా వరకు ప్రయాణికులు నేరుగా గమ్యానికి చేరుకొనేందుకే మొగ్గు చూపుతున్నారు. మారిన ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఒక అధికారి వివరించారు.

స్కూల్ వేళలకు అనుగుణంగా 2 వేల ట్రిప్పులు

ఈ నెల 12వ తేదీ సోమవారం నుంచి స్కూళ్లు తిరిగి తెరుచుకోనున్నాయి. విద్యార్థుల డిమాండ్ మేరకు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. పిల్లలు ఉదయం స్కూళ్లకు వెళ్లేందుకు సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకొనేందుకు వీలుగా బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ వెంకన్న తెలిపారు. సికింద్రాబాద్ రీజియన్‌లో ప్రతి రోజు సుమారు వెయ్యి ట్రిప్పులను అదనంగా నడపనున్నారు. హైదరాబాద్ రీజియన్‌లోనూ మరో వెయ్యి ట్రిప్పులను నడుపుతారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.